క్లుప్తంగా

అమ్మవారికి ఆషాఢ సారె



నరసరావుపేట రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారికి ఆదివారం విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. పట్టణానికి చెందిన హరే శ్రీనివాస భక్త బృందం సారెను సమర్పించింది. మహిళలు పొంగళ్లు పొంగించి సమర్పించారు. యాగశాలలో నిర్వహించిన చండీ హోమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



నరసరావుపేట రూరల్: తూర్పు గోదావరి జిల్లా తునిలో ఈనెల 1న నిర్వహించిన ఐదో రాష్ట్రస్థాయి ఆట్యా–పాట్యా పోటీల్లో పల్నాడు జిల్లా జిల్లా బాలబాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఫైనల్స్‌లో బాలుర జట్టు విశాఖపై, బాలికల జట్టు కర్నూలుపై విజయం సాధించాయి. గుంటూరు జిల్లా బాలబాలికల జట్లు తృతీయ స్థానంలో నిలిచాయి. జట్లకు కోచ్‌లుగా జి.ఝాన్సీరాణి, సీహెచ్. పుల్లయ్య వ్యవహరించారు.

వైభవంగా కైకల్య సహిత గీతా హోమం



నాదెండ్ల: గణపవరంలోని ఇడుపులపాడు కాటన్ మిల్స్‌లో ఆదివారం కైకల్య సహిత గీతా హోమం నిర్వహించారు. చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞానపీఠ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవిశెట్టి చలపతిరావు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా 144 హోమ గుండాలతో 151 హవన ద్రవ్యాలతో కై కల్య సహిత భగవద్గీతా హోమం వైభవంగా జరిగింది. హోమంలో కంపెనీ ఎండీ కామేపల్లి బ్రహ్మానాయుడు దంపతులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఉదయం ప్రారంభమైన హోమాలు, మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మణిపూర్‌లో దాడులను అరికట్టాలి



నాదెండ్ల: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులకు నిరసనగా ఆదివారం కనపర్రులోని కథోలిక చర్చి వద్ద విశ్వాసులు ఆందోళన నిర్వహించారు. దాడుల్లో 600కు పైగా చర్చిల్ని కూల్చి వేశారని, క్రైస్తవులపై దాడులు తీవ్రంగా జరుగుతున్నాయని స్థానిక విచారణ గురువులు పగడాల చిన్నప్ప తెలిపారు. మణిపూర్‌లో దాడుల్ని తీవ్రంగా ఖండించారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం సత్వర న్యాయం చేయాలని కోరారు. ఈ చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కథోలిక చర్చి విశ్వాసులు, యువత, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రూ.120కి చేరిన టమాటా ధర



యడ్లపాడు: టమోటా ధర కొండెక్కి కూర్చుంది. జూన్ మొదటి వారంలో రూ.30–40 మధ్య ఉన్న ధర ఇటీవల సెంచరీ కొట్టింది. వేసవి ప్రభావంతో దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. దీంతో మార్కెట్‌లో ధర సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎగబాకుతోంది. ఒకవైపు కొరత, మరోవైపు సెలవు దినం కావడంతో ఆదివారం మార్కెట్‌లో కేజీ ధర ఏకంగా రూ.120 పలికింది. ఇదే అదునుగా మార్కెట్లలో కొన్నిచోట్ల నాణ్యత లేని టమాటాను సైతం ఇదే ధరకు విక్రయిస్తున్నారు.

శరవేగంగా శావల్యాపురం రైల్వేస్టేషను అభివృద్ధి



రైల్వేస్టేషనులో జరుగుతున్న అభివృద్ధి పనులు



రెండో ప్లాట్ ఫాం నిర్మాణం

- డబ్లింగ్ పనుల్లో భాగంగా అదనంగా మూడు ట్రాక్‌ల ఏర్పాటు
- 1,200 మీటర్ల మేర ప్లాట్‌ఫాం నిర్మాణం
- కాలినడక వంతెన పనులు ముమ్మరం

శావల్యాపురం: జంక్షన్ కావడంతో శావల్యాపురం రైల్వే స్టేషనుకు మహర్దశ పట్టింది. అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గుంటూరు–నంద్యాల వరకు ట్రాక్ డబ్లింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 260 కిలోమీటర్లకు గానూ ఇప్పటి వరకు 120 కిలోమీటర్ల ట్రాక్ పనులు పూర్తయ్యాయి. మిగిలిన బ్యాలెన్స్ పనుల్లో ఈనెల 15న తర్లుపాడు, కంభం, జంగభట్లకృష్ణాపురం వరకు 22 కిలోమీటర్లు ప్రారంభం కానున్నాయి. శావల్యాపురం నుంచి చీకటిఈగలపాలెం వరకు 15 కిలోమీటర్ల డబ్లింగ్ పనులు ఈనెలాఖరులోగా పూర్తవుతాయి. నరసరావుపేట రూరల్ పరిధిలో మునపాక నుంచి సాతులూరు వరకు 22 కిలోమీటర్లు సెప్టెంబరు కల్లా పూర్తవుతాయి. గిద్దలూరు, దిగువమెట్ట, జంగంమెట్ల రైల్వే స్టేషన్ల పరిధిలో 38 కిలోమీటర్ల పనులు జనవరి నాటికి పూర్తవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. శావల్యాపురం రైల్వే స్టేషనులో గతంలో రెండు రైల్వే ట్రాక్‌లు ఉండగా డబ్లింగ్ పనుల్లో భాగంగా అదనంగా మూడు ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. దానికితోడు ప్రయాణికులు నడవడానికి అనుకూలంగా 1,200 మీటర్ల మేర ప్లాట్‌ఫాంతో పాటు కాలినడక వంతెన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

శావల్యాపురం రైల్వే స్టేషను వరకు నడికూడి–శ్రీకాళహస్తి ట్రాక్ పూర్తి

నడికూడి–శ్రీకాళహస్త్రి రైల్వే పనులు శావల్యాపురం రైల్వే స్టేషను వరకు పూర్తయ్యాయి. మార్చి 2024 నాటికి దర్శి వరకు పూర్తవుతాయి. ఇప్పటికే నడికూడి నుంచి గూడ్స్ రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. మార్కాపురం నుంచి నడికూడి వయా హైదరాబాదుకు ప్యాసింజరు రైళ్ల రాకపోకలు కొనసాగిస్తే శావల్యాపురం రైల్వే స్టేషనుకు మరింత ఆదాయం పెరుగుతుందని డీఆర్‌ఎం మంగళగిరి రామకృష్ణ తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ప్రజల ముగింట్లోనే ప్రజారంజక పాలన



ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

- సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి ఇంటికీ చేరిన లబ్ధి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజిని

నాదెండ్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి, చరిత్రలో ఎన్నడూలేని విధంగా సంక్షేమ కార్యక్రమాల అమలుతో ప్రజల ముగింట్లోనే ప్రజారంజక పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని అప్పాపురంలో ఆదివారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరిస్తూ గడప గడపను తట్టారు. మహిళలతో మమేకమయ్యారు. వృద్ధులు, చిన్నారులు, యువతను పలకరిస్తూ ముందుకసాగారు. స్థానిక దర్గాల్లో ఇమాం మీరసా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం కార్యక్రమం ప్రారంభించారు. ముస్లిం మైనార్టీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఇళ్ల పట్టాలు మంజూరు చేసి దేశంలోనే చరిత్ర సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశారన్నారు.అమ్మ ఒడి, విద్యా దీవెన, జగనన్న విద్యా కిట్లు, గోరుముద్ద, వసతిదీవెన, నాడూ నేడు వంటి కార్యక్రమాలు ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎంతో దోహదపడ్డాయని వివరించారు. 108, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ , ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలు పేదలకు నాణ్యమైన వైద్యాన్ని దరిచేర్చిందని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో ప్రపంచంలోనే గొప్ప కార్యక్రమాలు మన ప్రభుత్వంలో జరుగుతున్నాయని తెలిపారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలన వచ్చిందని వివరించారు. రైతు భరోసా కేంద్రాలు, కనీస మద్దతు ధర నిధి, మార్కెట్ యార్డుల బలోపేతం ద్వారా రైతుల పంటలకు మంచి గిట్టుబాటు ధరలు కల్పించారని తెలిపారు. ఎన్నికలు ఏడాదిలోగానే ఉన్నాయని, జాతీయస్థాయి సంస్థలు ఇటీవల నిర్వహించిన సర్వేల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయకేతనం ఎగురవేయనున్నదని తేలిపోయిందని వెల్లడించారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సుపరిపాలనను ప్రజలు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్ రావు, పార్టీ నాయకులు విడదల గోపీ, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, జగనన్న సురక్ష కన్వీనర్ అల్లడి రవికుమార్, మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ మూసా ఇస్లాం, సచివాలయ గృహ సారథుల కన్వీనర్ పఠాన్ సుభాని, మండల మాజీ ఉపాధ్యక్షుడు కోయలమూడి సాంబశివరావు, తిరుపతిస్వామి, నాయుడు మోహన్ రావు, ఉపేంద్ర, బ్రహ్మ య్య, పతకమూరి వీరయ్యయ్య, నాగభైరు వెంకట్, కందుల అప్పయ్య, షేక్ మునగసాటి సొకత్ అలి, కొరివి అనోక్, చేకూరి జాను, శ్రీను, గుర్రపుసాల ఆదినారాయణ, నరసయ్య, మోహనరావు, మునిపల్లి ఆదాం, ఇస్రాయేలు, యేసు, మికాయల్, ఏసుపాదం, ఆదెయ్య పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం

ఎమ్మెల్యే గోపిరెడ్డి



శాంతినగర్ ప్లాంటు పరిస్థితిపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పురపాలక పరిధిలోని ప్రజలందరికీ తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మున్సిపల్ అధికారులతో కలసి ఆదివారం రావిపాడు గ్రామ సమీపాన గల శాంతినగర్‌లోని మున్సిపల్ నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి పరిస్థితిని గురించి ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల కిందట రిజర్వాయర్ నుంచి పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు వచ్చే ప్రధాన పైపులైనుకు లీకు ఏర్పడిందని తెలిపారు. దీనికి మరమ్మతులు చేసే క్రమంలో రెండు రోజుల పాటు పట్టణంలోని కొన్ని ప్రాంతాల ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు చేరడంలో ఆలస్యం కారణంగా ఆలస్యమైందని వివరించారు. దీంతో పాటు నకరికల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు తగ్గడం కారణంగా శాంతినగర్ ఫిల్టర్ బెడ్‌కు అవసరమైనంత చేరడం లేదని చెప్పారు. బూస్టర్ల ద్వారా ఫిల్టర్‌బెడ్‌కు నీరు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఫిల్టర్ బెడ్‌లో 22 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉండగా కేవలం 14ఎంఎల్‌డీ నీటినే శుద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు ఎన్‌ఎస్పీ కాలువ నుంచి నీరు తీసుకునేందుకు సాగర్ నుంచి నీటిని వదిలే విషయంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకెళ్లామ ని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి తాగునీటి అవసరాల నిమిత్తం నీరు తీసుకునే విషయం వచ్చే బుధవారం చర్చిస్తామని సాగర్ ఈఎన్‌సీ వెల్లడించారని ఎమ్మెల్యే గోపిరెడ్డి తెలిపారు. పట్టణంలో నీటికి కొరత ఏర్పడిన ప్రాంతాల ప్రజలకు ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నామని చెప్పారు. వచ్చే రెండు మూడు రోజుల్లో సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్, ఎంఈ డి.శ్రీనివాసరావు, ముదిరాజు, గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్లు ఈ.ఎం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, మాజీ కౌన్సిలర్లు నెలటూరి మురళి, షేక్ కరీముల్లా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బైక్‌ల చోరీ

నసరావుపేట టౌన్: రెండు బైక్‌ల చోరీపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. పాతూరులోని రమాదేవి ఆస్పత్రి ఎదుట నిలిపిన రెండు వాహనాలు అపహరణకు గురయ్యాయి. ఈ మేరకు బాధితులు పొలిశెట్టి సురేష్, సందాని కృష్ణ ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్లు పోతే ఆధారాలతో ఫిర్యాదు చేయాలి



స్టేషనులో మాట్లాడుతున్న రూరల్ సీఐ సుధాకర్

శావల్యాపురం: సెల్‌ఫోన్లు పోయిన వారంతా ఆధారాలతో పోలీసు స్టే షనులో ఫిర్యాదు చేస్తే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా చర్యలు తీసుకుంటామని విను కొండ రూరల్ సీఐ ఉప్పు టూరి సుధాకర్ తెలిపారు. స్థానిక పోలీ సు స్టేషను సీఐ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ పరిధిలో అన్నీ మండలాల్లో నేరాల రేటు గణనీయంగా తగ్గిందని తెలిపారు. చట్టాలపై ప్రజల్లో చైతన్యం పెరగడంతో నేరాలు నియంత్రణ అవుతున్నాయని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల్ని సహించమని, గ్రామాల్లో పోలీసు నిఘా పెంచామని తెలిపారు. అనంతరం స్టేషనులో రికార్డు పరిశీలించి, సిబ్బంది పలు సూచనలు చేశారు. ఆయనతో ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గల్లా రవికృష్ణ ఉన్నారు.

4న వేల్పూరులో జగనన్న సురక్ష

శావల్యాపురం: మండలంలోని వేల్పూరులో గల రెండు గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. రెండు టీమ్స్ సారథ్యంలో సచివాలయాల వారీగా శిబిరాలు జరుగుతాయన్నారు. వారం రోజుల నుంచి వలంటీర్లు ఇంటింటి సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. వేల్పూరు గ్రామ సచివాలయం–1లో 1,251 ఇళ్లకు గానూ 866 సర్వే చేసినట్లు చెప్పారు. వేల్పూరు– 2 గ్రామ సచివాలయం పరిధిలో 1,343 ఇళ్లకు గానూ 990 సర్వే చేసినట్లు తెలిపారు. రెండు గ్రామ సచివాలయాల పరిధిలో 950 అర్జీల్ని ఆన్‌లైన్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల్ని అదే రోజు ఉచితంగా అందజేస్తామని ఎంపీడీవో వెల్లడించారు.

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన



రొంపిచర్ల హైస్కూలులో కంటి పరీక్షలు



సొలస శిబిరంలో రోగులకు సూచనలు చేస్తున్న వైద్యులు



బుచ్చిపాపన్నపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ క్రాంతికుమార్‌రెడ్డి

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, గుంటూరు రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంతో పాటు ఈపూరు, నరసరావుపేట మండలాలకు చెందిన గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శిబిరంలో వైద్యులు 700 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారిలో 370 మందిని ఆపరేషన్ కేసులుగా గుర్తించారు. శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. ర్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, గుంటూరు రోటరీ క్లబ్ సభ్యులు పడాల జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, రామకోటి రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.రామకుష్ణారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు

యడ్లపాడు: మండలంలోని సొలసలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెక్స్ జనరేషన్ సేవ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక రంగనాయకస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు నజీరుద్దీన్, ఎముకలు విభాగం విపుణులు రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు. 250 మంది రోగులకు ఈసీజీ, బీపీ, షుగర్, రెటీనా తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 20 మందిని కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గ్రామ పెద్దలు మద్దూరి వీరారెడ్డి, సంస్థ చైర్మన్ నాగండ్ల శివరామకృష్ణ, కృష్ణవేణి, హోప్ విన్ హాస్పిటల్ మేనేజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చిపాపన్నపాలెంలో 170 మందికి వైద్య పరీక్షలు

రొంపిచర్ల: మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో ఆదివారం వేద హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి 170 మందికి సేవలు అందించారు. షుగర్, బీపీ, రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించి, రోగ నిర్ధారణ అనంతరం అవసరమైన మందుల్ని అందజేశారు. వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పించారు. తమ వైద్యశాల్లో అన్ని రకాల ఆరోగ్య పరీక్షల్లో రాయితీ ఇస్తున్నట్లు డాక్టర్ క్రాంతికుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చీమల శ్రీనివాసరెడ్డి, గజ్జల ముసలారెడ్డి, గానుగపంట సుబ్బారెడ్డి, ఏడుకొండలురెడ్డి, జయభారత్‌రెడ్డి, ముసలారెడ్డి, పోతులూరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బాబాపేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని ఆరో వార్డు బాబాపేటలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆదివారం సాయంత్రం వార్డులో పర్యటించారు. గడపగడపలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం రూ.20లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల్ని టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో కల్వర్టులు, డ్రైయిన్లు, విద్యుత్ పనులు చేపట్టామని చెప్పారు. ఆరు, ఏడు, ఎనిమిది వార్డులకు సంబంధించి ఈ వార్డులో రూ.80లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తయిందని, త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పటికే డాక్టర్లు, వైద్య సిబ్బంది తాత్కాలిక భవనంలో పని చేస్తున్నారని తెలిపారు. పంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతాల్ని పురపాలక సంఘంలో విలీనం చేసి రూ.10కోట్లతో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీఎం ప్రారంభించిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు ప్రజాభిమానం పొందాయని తెలిపారు.

వాపు చూసి బలం అనుకుంటున్న టీడీపీ నేతలు

తెలుగుదేశం నాయకులు వాపు చూసి బలం అనుకుంటున్నారని, వాస్తవంలో వైఎస్సార్ సీపీ బలమేమిటో జాతీయ స్థాయి టైమ్స్‌నౌ సర్వే స్పష్టం చేసిందని చెప్పారు. రాష్ట్రంలోని 25లోక్ సభ సీట్లలో 24 వైఎస్సార్ సీపీ గెల్చుకుంటుందని సర్వే తేల్చి చెప్పిందని పేర్కొన్నారు. స్థానిక టీడీపీ నాయకుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పచ్చి అబద్ధాలు మాట్లాడటంలో దిట్ట అన్నారు. జేఎన్‌టీయూని తామే రూ.30కోట్లతో నిర్మిస్తున్నామని చెబుతున్నారని, వాస్తవానికి ప్రారంభించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనేనని వెల్లడించారు. టీడీపీ హయాంలో రూ.3కోట్లతో నిర్మించిన ప్రహరీ విషయంలో కాంట్రాక్టర్‌ను లంచాల కోసం బెదిరిస్తే పనులు ఆపేశాడని తెలిపారు. తాము వచ్చిన తర్వాత కాంపౌండ్ వాలును పూర్తిచేసి, రూ.115కోట్లతో కళాశాల నిర్మాణం పూర్తిచేస్తున్నామని చెప్పారు. మొన్న బస్సుయాత్ర సందర్భంగా తాను రూ.2వేలకోట్లు సంపాదించానని చెప్పిన అరవిందబాబు ఈరోజు నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రూ.5వేలకోట్లు సంపాదించానని చెప్పాడన్నారు. కేవలం మూడు రోజుల వ్యవధిలోనే రూ.3వేలకోట్లు సంపాదించానా? అని గోపిరెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలతో సామాన్యుడు సతమతం

నరసరావుపేట: విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ జిల్లా పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్జీవోహోమ్‌లో సీఐటీయు నాయకుడు సిలార్ మసూద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం, ఎంసీపీఐ (యు), జై భీమ్ భారత్ పార్టీ, ఎంఐఎం, సీఐటీయు, రైతు సంఘం, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు. సర్‌చార్జీలు ప్రజలపై మోయలేని భారంగా మారాయని తెలిపారు. చార్జీల తగ్గింపునకు కార్యాచరణలో భాగంగా ఈనెల ఐదో నుంచి 10 వరకు రిలే నిరాహార దీక్షలు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు విజయ కుమార్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి షేక్ మొహిద్దిన్ బాష, జై భీమ్ భారత్ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా సమన్వయకర్త గోదా జాన్ పాల్, ఎంఐఎం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.